ఆ గృహస్థుకి సాధువు బోధ వంట పట్టింది.

దారిలో సౌకర్యం కోసం వెంట తెచ్చుకున్న వస్తువులన్నిటినీ పంచేసి, వాటిని మోయడానికి తెచ్చుకున్న కూలీలని వెనక్కి పంపించేసాడు. కనీస అవసరాలతో, చిన్న చేతి సంచీతో కాశీకి ప్రయాణమయ్యాడు.

## 19. భక్తి-జ్ఞానం

మహారాష్ట్రలో జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్‌లనే ఇద్దరు మహాత్ములుండేవారు. పాండురంగని భక్తుడైన నామ్‌దేవ్‌కి విఠలుడు కన్పించి మాట్లాడుతుండేవాడు. ఓ రోజు జ్ఞానేశ్వర్ తన శిష్యులతో మాట్లాడుతూండగా గోరా అనే కుండలమ్మేవాడు వచ్చాడు.

"నువ్వు 'కుండలు పచ్చిగా ఉన్నాయా లేక బాగా కాలాయా' అని తెలుసుకుంటావు కదా? అలాగే ఇక్కడున్నవారిలో ఏవి పచ్చి కుండలో ఏవి బాగా కాలాయో తెలుసుకుని చెప్పు చూద్దాం." చెప్పాడు జ్ఞానేశ్వర్.

వెంటనే జ్ఞాని అయిన గోరా కుండలని తట్టే కర్రని తీసుకుని వారి దగ్గరకి వెళ్ళి దాంతో వాళ్ళ తలల మీద కొట్టసాగాడు. అక్కడ నామదేవుడు కూడా ఉన్నాడు. అతను పాండురంగడి భక్తుడు. నిత్యం నామ్‌దేవుడుకి పాండురంగడి దర్శనం లభిస్తూండేది. అలాంటి తన దగ్గరకి గోరా రాగానే నామ్‌దేవుడు అతన్ని దూరంగా తోసి చెప్పాడు.

"నిత్యం పాండురంగడితో ఆడుకునేవాడ్ని. నన్ను పరీక్షించాల్సిన పనిలేదు."

జ్ఞానేశ్వర్ నామదేవుని వారించి గోరాని పరీక్షించమన్నాడు. గోరా అతని తలమీద కర్రతో తట్టాక చెప్పాడు.

"స్వామీ! నామదేవుడు ఇంకా పచ్చికుండే. మిగిలిన వాళ్ళంతా కాలిన కుండలు."

జ్ఞానేశ్వర్ కూడా అది నిజమని ఒప్పుకోగానే నామదేవుడికి రోషం కలిగింది. వెంటనే ఏడుస్తూ పాండురంగడి గుడికెళ్ళి ఆయన్ని అడిగాడు.

"నేను పచ్చికుండనా? నిజం నువ్వే చెప్పు స్వామీ."

"ఈ గ్రామం చివర అడవిలో శివాలయంలో ఓ సాధువు ఉన్నాడు. వెళ్ళి ఆయన్ని అడిగితే నీకు నిజం చెప్తాడు." విఠలుడు బదులిచ్చాడు.

దాంతో నామదేవుడు ఆ సాధువుని వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ సమయంలో ఆ సాధువు శివలింగం మీద కాళ్ళు పెట్టుకుని నిద్రపోతూ కనిపించాడు. నామదేవుడు ఆయన్ని నిద్ర లేపి కోపంగా చెప్పాడు.

"ఏమిటిది? శివుడి మీద కాళ్ళు పెట్టి పడుకుంటావా?"

"నాయనా! నాకు కళ్ళు కనబడవు. కొద్దిగా నా కాళ్ళు ఎత్తి శివుడు లేని చోట ఉంచు." చెప్పాడాయన.

నామదేవుడు ఆయన కాళ్ళు తీసి ఎక్కడ పెట్టినా అక్కడ ఓ శివలింగం కనిపించసాగింది. అప్పుడు నామదేవుడికి 'భగవంతుడు లేని చోటు లేదు' అన్న సత్యం స్ఫురించింది.

అతను పాండురంగడి గుడికి వెళ్ళడం మానేసాడు. వారం తర్వాత విఠలుడే నామదేవుడి దగ్గరకి వచ్చి 'గుడికి రావడం లేదేమని' అడిగాడు.

"స్వామీ! ఇంతకాలం నువ్వు ఆ గుళ్ళో మాత్రమే, ఆ రూపంలోనే ఉంటావనుకున్నా. కానీ నువ్వు లేనిదెక్కడ? నీకోసం నేను రావడం దేనికి?" ఎదురు ప్రశ్న వేసాడు నామదేవుడు.

"నీకు తత్త్వజ్ఞానం అబ్బాలనే ఇదంతా జరిగింది. ఇంతకాలం నీకు భక్తి తప్ప జ్ఞానం లేదు. భగవంతుడ్ని తెలుసుకోవడానికి జ్ఞానం ముఖ్యం. నువ్వు ఆ సాధువు పాదాలు పట్టుకోగానే నీకు జ్ఞానం అబ్బింది. జ్ఞానానికి గురువు పాదాలే శరణ్యం తప్ప దేవుడి పాదాలు కాదు."

ఆ మాటలతో అతనికి జ్ఞానమే భక్తి కన్నా ఉత్కృష్టమైందని అర్థమైంది.